ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించిన ఎమ్మెల్యే



వలంటీర్లతో కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గత నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేది వరకు పలు స్వచ్ఛత, సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంది. వలంటీర్లను బుధవారం కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వలంటీర్లు అరుంధతి ఆసుపత్రిలో రోగులకు పలు సేవలు అందించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం..

ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ఫౌండేషన్ డేను ఘనంగా నిర్వహించారు. వ్యాస రచన, ఉపన్యాసం, పెయింటింగ్, చర్చా వేదిక, నృత్యం, ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఉత్తమ వలంటీర్ అవార్డులు పొందిన గుగ్లావత్ యశస్విని, ధీరజ్ కుమార్‌లను అభినందించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ రాధికాదేవి, అన్వాస ఆర్గనైజేషన్ ప్రతినిధి శ్రీరామ్, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ జన్మదిన వేడుకలు


పారిశుద్ధ్య కార్మికుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కవిత

కుత్బుల్లాపూర్: మాజీ ఎంపీపీ సన్న కవిత జన్మదిన వేడుకలను కొంపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం యాదవ్‌తో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. వైస్ చైర్మన్ గంగయ్య, కౌన్సిలర్లు వసంత లక్ష్మణ్ గౌడ్, సువర్ణ, శిరీష, కృష్ణవేణి, మంజుల కుమార్ గౌడ్, చింతల లక్ష్మీ దేవేందర్ యాదవ్, కో ఆప్షన్ సభ్యురాలు మంగమ్మ, శివ యూత్ అసోసియేషన్ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


కేక్ తినిపిస్తున్న సన్న శ్రీశైలంయాదవ్

అదుపుతప్పి కంటైనర్ బోల్తా


బహదూర్‌పల్లి చౌరస్తాలో
రోడ్డుపై బోల్తా పడిన కంటైనర్

ఎవ్వరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం

దుండిగల్: నిత్యం రద్దీగా ఉండే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద భారీ కంటైనర్ బోల్తా పడింది. అదే సమయంలో పక్కనే ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జరిగింది. కొంపల్లి నుంచి భారీ కంటైనర్ షెడ్లకు వేసే ఇనుప పిల్లర్ల లోడ్డుతో గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్తుంది. ఈ క్రమంలో బహదూర్‌పల్లి చౌరస్తా వద్ద కంటైనర్ మలుపు తీసుకుంటుండగా అదుపు తప్పి బోల్తా పడింది. సిగ్నల్ పడిన సమయంలో పక్కనే వాహనదారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే దుండిగల్, జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు చేరుకుని క్రేన్ సాయంతో కంటైనర్‌ను తొలగించారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.


బతుకమ్మతో చిన్నారి


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

పూలు పేర్చి.. బతుకమ్మ ఆడి

తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి పసుపుతో తయారు చేసిన గౌరమ్మకు బియ్యం పిండి, నువ్వులు, నూకలతో తయారు చేసిన ప్రసాదంగా నివేదించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు బతుకమ్మలను ఒక చోట పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. – కుత్బుల్లాపూర్


నిజాంపేట జర్నలిస్టు కాలనీలో...




జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో..


చింతల్ శ్రీనివాస్‌నగర్‌లో..


సోమయ్యనగర్ బతుకమ్మ కుంట వద్ద..


నిజాంపేట్ ప్రశాంత్‌హిల్స్ కాలనీలో..






బతుకమ్మతో మహిళ, చిన్నారి

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి

చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళి అర్పించిన ప్రజాప్రతినిధులు, నేతలు

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి గాంధీ చేసిన ఉద్యమాలను వక్తలు గుర్తు చేశారు. భావి తరాలు ఆయన చూపిన అడుగుజాడల్లో నడిచి దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. – కుత్బుల్లాపూర్


గాంధీనగర్‌లో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్


షాపూర్‌నగర్‌లో నివాళి అర్పిస్తున్న
ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ రావుల శేషగిరి


సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో నివాళి అర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్


చింతల్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న
కార్మిక నేతలు, కార్మికులు


కొంపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న
మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరి

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల పైన వ్యాపారాలు చేసే వాటిని తొలగిస్తున్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని ధోలారి ధని వద్ద రాత్రికి రాత్రి మూడు తోపుడు బండ్లు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తుండటంతో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు వాటిని గుర్తించి జరిమానా వేశారు. రోడ్డు పక్కన ఉన్న తినుబండారాలతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారే వాటిని తొలగింపజేస్తున్నారు. కొంతమంది ఇవేమీ పట్టించుకోకపోవడంతో.. జరిమానా వేస్తూ మరోవైపు కేసులు నమోదు చేస్తున్నారు. వారం రోజులుగా కొంపల్లి నుంచి సుచిత్ర వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తొలగింపు ప్రక్రియ చేపట్టామని పోలీసులు తెలిపారు.


టిఫిన్ సెంటర్ నిర్వాహకుడితో
మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

క్లీన్ అండ్ గ్రీన్‌లో వారి పాత్ర కీలకం

హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్

రాయదుర్గం: హెచ్‌సీయూను క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్ రూపకల్పనలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్, హార్టీకల్చర్, శానిటేషన్ విభాగాల పాత్ర కీలకమని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ స్వచ్ఛతాహీసేవ, స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాల ముగింపు కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాల నిర్వహణలో క్యాంపస్ క్లీనప్ డ్రైవ్ చేపట్టి పరిశుభ్ర వాతావరణం నెలకొనేలా చేయడం హర్షణీయమన్నారు. త్వరలో ప్రత్యేక గ్రామ శిబిరానికి వెళ్లాలని ఎన్‌ఎస్‌ఎస్ సెల్ నిర్ణయించడం హర్షణీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.కృష్ణయ్య, ఎన్‌ఎస్‌ఎస్ హెచ్‌సీయూ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భాసెట్టి లత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న
రిజిస్ట్రార్ దేవేష్‌నిగమ్, కోఆర్డినేటర్ కృష్ణయ్య

దుస్తులు కొనేందుకు వెళ్లి వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: దుస్తులు కొనుగోలు చేసేందుకు షాపునకు వెళ్లిన ఓ వ్యక్తి స్పృహతప్పి పడిపోయి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ ప్రాంతానికి చెందిన కలాల్ ప్రవీణ్ కృష్ణ (37) తేజశ్రీ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ప్రగతి నగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నివాసం ఉంటున్న ప్రవీణ్ కృష్ణ మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో దుస్తులు కొనుగోలు చేసేందుకు ప్రగతి నగర్ రోడ్డులోని షాపునకు వెళ్లాడు. స్పృహ తప్పి కింద పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యాయి. కొంత కాలంగా మిషన్ భగీరథ పనుల కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తిరిగి నూతనంగా రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను ప్రారంభించారు. బుధవారం కౌన్సిలర్లు, మున్సిపల్ ఏఈ సురేందర్ నాయక్‌తో కలిసి పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణకు స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు సత్తిరెడ్డి, భీంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, నాయకులు మురళీయాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, ధర్మారెడ్డి, ఆకుల యాదయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సన్మానం


మెమొంటో అందజేస్తున్న మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్లు

నిజాంపేట్: భారత స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన మున్సిపల్ సిబ్బందిని మేయర్ కొలన్ నీలారెడ్డి సత్కరించారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పలు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు ఆగం పాండు, సురేష్‌రెడ్డి, గాజుల సుజాత, రాఘవేంద్రరావు, కో ఆప్షన్ సభ్యురాలు వాణీ స్టీఫెన్‌పాల్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వానం అందజేత


ఎమ్మెల్సీ రాజుకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

దుండిగల్: నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు బుధవారం ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానాన్ని అందజేశారు. అదే విధంగా వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.

ఆలయంలో అన్నదానం.. పూజలు

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకుని బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అదే విధంగా మగ్దూమ్‌నగర్‌లోని బొడ్రాయి వద్ద సంక్షేమ సంఘం సభ్యులు పూజలు నిర్వహించారు.


జగద్గిరిగుట్ట దుర్గామాత ఆలయ
ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం

నిషేధం ఉన్నా మాంసం అమ్మకాలు

నిజాంపేట్: గాంధీ జయంతి సందర్భంగా అధికారులు మంసాహార విక్రయాలను నిషేధించినా కొందరు దుకాణదారులు అమ్మకాలు చేపట్టారు. కార్పొరేషన్ అధికారులు స్పష్టమైన నోటీసులు జారీ చేశారు. అయినా బుధవారం ప్రగతినగర్ ఇన్‌కాయిస్ చౌరస్తా సమీపంలోని గోదావరి కట్స్ దుకాణదారులు నిబంధనలకు తూట్లు పొడుస్తూ మంసాహార విక్రయాలు చేపట్టారు. దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు గాంధేయవాదులు డిమాండ్ చేస్తున్నారు.


ప్రగతినగర్‌లో చేపల విక్రయం

నియామకం.. సన్మానం


సరితారావును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

కుత్బుల్లాపూర్: ఇటీవల మహిళా మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సరితా రావును బీజేపీ నాయకులు బుధవారం సత్కరించారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, పొత్తూరి శివాజీ రాజు, సతీష్ సాగర్, జనార్దన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మధు, జంపన రమేష్, మాధురి, సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మూసాపేట: ఓ ఇంటిలో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి మద్యం సీసాలను, వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మూసాపేట హబీబ్‌నగర్ సమీపంలోని శక్తినగర్‌లో వరంగల్ జిల్లాకు చెందిన గుంటూరు సుబ్బారెడ్డి (48) అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. కావేరి ట్రావెల్స్ సమీపంలో ఓ చిన్న హోటల్ నడిపిస్తున్నాడు. ఇంట్లోనే మద్యం విక్రయిస్తుండగా క్రైమ్ పెట్రోలింగ్ పోలీసులు అనుమానం వచ్చి దాడి చేయగా.. అతని నుంచి 27 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని సుబ్బారెడ్డిని అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.